సాక్షి
నంద్యాల
సోమవారం : 28 అక్టోబర్ : 2024



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. దేవస్థానం అధికారులు పూజలు చేసి ఆలయ ప్రదక్షిణ చేయించారు.



గాజులదిన్నెకు జలకళ

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఎల్లెల్సీ నుంచి నీటి విడుదల కొన సాగుతుండటం, ఇటీవల మోస్తరు వర్షాలతో వరద నీరు చేరడంతో 2.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



పప్పుశనగ సాగుపై నీలినీడలు!

పప్పు శనగ సాగు చేయాలనుకున్న రైతుల ఆశ లు సన్నగిల్లుతున్నాయి. సరిగ్గా విత్తనాలు వేసే సమయంలోనే తుపాను ప్రభావంతోవర్షాలు కురవడంతో సాగుకు ఆటంకం ఏర్పడింది. 8లో

న్యూస్‌రీల్

కొత్తూరులో జిల్లా జడ్జి పూజలు



జడ్జికి తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామిని ఆదివారం నంద్యాల జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి. రాధాదేవి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి ఈఓ రామకృష్ణ స్వాగతం పలికి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేయించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ నాగలింగేశ్వరస్వామికి జడ్జి పూజలు చేశారు. అనంతరం ఆమెకు అర్చకులు స్వామి తీర్థప్రసాదాలు అందించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల: పట్టణంలోని కలెక్టరేట్ సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏవైనా సమస్యలుంటే ప్రజలు అర్జీలు సమర్పించవచ్చునని వెల్లడించారు. ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు.

శ్రీశైలంలో 212 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలో ఆదివారం సాయంత్రం సమయానికి 212.4385 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 884.40 అడుగులకు చేరింది. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలానికి 72,411 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. శనివారం నుంచి ఆదివారం వరకు ఎగువ ప్రాజెక్టుల నుంచి 1,04,017 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దిగువ ప్రాజెక్ట్‌లకు కూడా అదే పరిమాణంలో నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.474 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.624 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

నంద్యాల(రూరల్): శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం నవంబర్ మొదటి వారం నుంచి నంద్యాల మీదుగా నలుగు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశారు. నంద్యాల నుంచి ఎక్కువ మంది అయ్యప్ప స్వాములు శబరిమలకు వెళ్తారని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లడంతో అనుమతి ఇచ్చినట్లు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వీరు వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూల ద్వారా స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నను స్పర్శ దర్శనం చేసుకుని, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సర్వ దర్శనానికి 4గంటలు, శీఘ్ర దర్శనానికి 2గంటల సమయం పట్టింది.

ఆరోగ్య భరోసాకు ఎసరు!

ఆరోగ్యశ్రీ స్థానంలో బీమా తెచ్చే యోచనలో ప్రభుత్వం

- అయుష్మాన్ భారత్ కార్డుల అమలుకు యత్నం
- సాధ్యాసాధ్యాల గురించి ఆరోగ్య శాఖ మంత్రి చర్చ
- ప్రైవేటు ఆసుపత్రుల అభిప్రాయాలు తీసుకుంటున్న వైనం
- త్వరలో నూతన ఆరోగ్య పాలసీ శ్రీకారానికి చర్యలు
- మరోవైపు సమ్మెకు సిద్ధమవుతున్న వైద్యమిత్రలు



పేదల సంక్షేమానికి తూట్లు పొడుస్తున్న కూటమి ప్రభుత్వం అదే దారిలోనే ఉచితంగా ఖరీదైన వైద్యం అందించే ఆరోగ్యశ్రీ పథకానికి మంగళం పాడేందుకు కుట్ర పన్నుతోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆరోగ్య రక్షగా నిలిచే ఈ పథకంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రభుత్వంపై భారం తగ్గించుకోవాలనే ఆలోచనతో పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్య సేవలను దూరం చేసే ప్రయత్నం చేస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పథకం స్థానంలో నూతన ఆరోగ్య పాలసీని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియతో అటు పేదలు, ఇటు ఆరోగ్యమిత్రల్లో ఆందోళన నెలకొంది.

కర్నూలు(హాస్పిటల్): జేబులో ఒక్క రూపాయి లేకపోయినా కార్పొరేట్ ఆసుపత్రిలో దర్జాగా వైద్యం చేసుకునేలా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి రూపకల్పన చేశారు. ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం ఈ పథకాన్ని మరింత మెరుగులు దిద్ది ప్రతి సంవత్సరం వేలాది మందికి ప్రాణం పోసేలా చేశారు. ఇప్పుడు ఆ పథకానికి గ్రహణం పట్టుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎన్‌టీఆర్ వైద్య సేవగా పేరు మార్చింది. తాజాగా ఈ పథకాన్నే లేకుండా చేసేందుకు కుట్ర పన్నుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 11,86,220 ఎన్‌టీఆర్ వైద్య సేవ కార్డులు ఉన్నాయి. అలాగే మొత్తం 229 నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా, 165 మంది వైద్య మిత్రలు విధులు నిర్వహిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం స్థానంలో బీమా (ఇన్సూరెన్స్) తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. అప్పటి వరకు కార్పొరేట్ హాస్పిటల్ అంటే ఏమిటో కూడా తెలియని పేదవాడు ఆ భవనం మెట్టు తొక్కడమే గాకుండా ఆరోగ్యశ్రీ కార్డు జేబులో పెట్టుకుని దర్జాగా అక్కడి బెడ్‌పై పడుకుని చికిత్స అందుకున్నాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు లక్షలాది మంది పేద, మధ్యతరగతి వారు ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు. ఆయన తదనంతరం వచ్చిన ముఖ్యమంత్రులు పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశారు. పథకం అమలులో పలు రకాల ఆంక్షలు పెడుతూ పేదలకు క్రమంగా దూరం చేసే ప్రయత్నం చేశారు.

సమ్మె యోచనలో వైద్యమిత్రలు

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం వైద్యమిత్రలు సమ్మెలోకి వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నారు. సమస్యలకు పరిష్కారం చూపకపోతే ఈ నెల 29వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పరిధిలోని పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లే అవకాశం ఉంది. మరోవైపు ఆరోగ్యశ్రీ స్థానంలో వచ్చే బీమాలో తమను తీసుకుంటారా లేక బీమా కంపెనీ ఉద్యోగులే నూతన పథకాన్ని అమలు చేస్తారా అన్న అనుమానాలు కూడా వారిని వేదిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగ భద్రతకే ముప్పు ఏర్పడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సమ్మె నోటీసు చూపుతున్న వైద్యమిత్రలు (ఫైల్)

గత ప్రభుత్వ హయాంలో వైఎస్‌ఆర్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక పథకాన్ని మరింత మెరుగ్గా రూపుదిద్దారు.

ఆరోగ్యశ్రీకి మంగళం పాడేందుకు కుట్ర

ఆరోగ్యశ్రీ **అంటే వైఎస్‌ఆర్, ఆయన తనయుడు** జగన్ గుర్తుకొస్తున్నారని, ఈ పథకాన్ని ఎలాగైనా తీసేయాలని ఎప్పటి నుంచో టీడీపీ ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోంది. గతంలోనూ ఇలాగే ప్రయత్నాలు చేసి ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని భావించి ఊరుకుంది. ఇప్పుడు మళ్లీ అధికారం చేపట్టాక పథకాన్ని ఎలాగైనా మంగళం పాడేయాలని కుట్రలు పన్నుతోంది. ఇందుకు సంబంధించి ఇటీవల ఓ ముఖ్య ఉన్నతాధికారి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి తాము ఆరోగ్యశ్రీ స్థానంలో **బీమా తీసుకురావాలని నిర్ణయించామ**ని, దీనిపై సాధ్యాసాధ్యాల గురించి చర్చించాలని, సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఈ మేరకు చాలా మంది ప్రస్తుత ఆరోగ్యశ్రీ పథకమే బాగుందని, ఈ పథకాన్ని ముట్టుకుంటే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని పలువురు సూచించినట్లు సమాచారం. అయితే ఆరోగ్యశ్రీ కంటే మిన్నగా బీమా ద్వారా మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తామని, తద్వారా ఆసుపత్రులకు మేలు జరుగుతుందని వారిని మంత్రి ఒప్పించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది.

జిల్లాల వారీగా వివరాలు

కర్నూలు జిల్లా		నంద్యాల జిల్లా
6,49,333	ఎన్‌టీఆర్ వైద్యసేవ కార్డులు	5,36,887
128	నెట్‌వర్క్ ఆసుపత్రులు	101
98	ఆరోగ్య మిత్రలు	67

మూడేళ్ల క్రితం కేవలం 1,800లోపు ఉన్న చికిత్సలను 3,255కు పెంచారు. అంతేగాక ఇతర రాష్ట్రాల వారు ఎవ్వరైనా ఇక్కడ రోడ్డు ప్రమాదానికి గురైతే వారికి ఏ ఆసుపత్రిలోనైనా ఉచితంగా చికిత్స అందించే ఏర్పాట్లు చేశారు.

ఆయుష్మాన్ భారత్ తీసుకొచ్చే ప్రయత్నం

ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో ఉన్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రంలో తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఇందులో వ్యాధుల సంఖ్య 1900లోపే ఉండటం, ప్యాకేజీ కూడా తక్కువగా ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రులు దీనిపై నిరాసక్తత చూపుతున్నట్లు సమాచారం. ఈ పథకాన్ని ఇక్కడ కూడా అమలు చేసి 1,900 వ్యాధుల పైబడిన వ్యాధులను బీమా పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. కేవలం రూ.20లక్షల నుంచి రూ.25లక్షల విలువజేసే కొన్ని వ్యాధులు మాత్రమే ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు నూతన ఆరోగ్య పాలసి రూపొందించే పనిలో కూటమి పెద్దలు ఉన్నట్లు స్పష్టం అవుతోంది.

రేపటి నుంచి సమ్మెలోకి వెళ్తున్నాం



17 ఏళ్లుగా మేము ఆరోగ్య శ్రీలో పనిచేస్తున్నాం. అయినా మాకు ఇప్పటి దాకా ఎలాంటి కేడర్ లేదు. ఈ సర్వీసును పరిగణలోకి తీసుకుని కేడర్ కల్పిస్తూ కాంట్రాక్టులోకి మమ్ములను మార్చాలి. వైద్య మిత్రల నుంచి టీమ్ లీడర్లుగా పదోన్నతులు కల్పించాలి. మా డిమాండ్ల సాధనకు మంగళవారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నాం. ఇది వరకే అధికారులు, ప్రజాప్రతినిధులందరికీ నోటీసులు అందజేశాం.

– ఎస్.లక్ష్మీప్రసన్న, ఎన్‌టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు

ఆరోగ్యశ్రీ రద్దు చేస్తే ఉద్యోగ భద్రత ఉండదు



ఎన్‌టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ)ని తీసేసి ఇన్సురెన్స్ (బీమా)లోకి మార్చడం వల్ల ఇప్పుడున్న ఉద్యోగుల్లో అభద్రతా భావం ఏర్పడుతోంది. ఇన్సురెన్స్ రావడం వల్ల మా ఉద్యోగాలు ఉంటాయో పోతాయో తెలియదు. ఇన్సురెన్స్ వచ్చినా అందులో మమ్మల్నే కొనసాగించాలి. జీవో 28 వల్ల ఉద్యోగాలు తిరిగి రాలేని పరిస్థితి ఉన్నందున దానిని రద్దు చేయాలి.

– జి.రాజశేఖర్ రెడ్డి, ఎన్‌టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి

ఇన్సూరెన్స్ పాలసీలో ఆంక్షలు అధికం



రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్యసేవ) పథకాన్నే కొనసాగించాలి. దీనికి ఎప్పటికప్పుడు నిధులు కేటాయించాలి. అలా గాకుండా ఇన్సూరెన్స్ విధానాన్ని తీసుకురావాలని చూస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంది. ఎందుకంటే ఇప్పటికే కొన్ని కంపెనీలు ప్రీమియం చెల్లించినా వైద్యం విషయంలో చాలా ఆంక్షలు పెడుతున్నాయి. చాలా ఆసుపత్రుల్లో వైద్యం చేయడం లేదు. దీంతో పాటు ఇన్సురెన్స్‌కు ప్రజలే ప్రీమియం చెల్లించాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో వారిపై మరింత భారం వేసినట్లు అవుతుంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆలోచనను విరమించుకోవాలి. –కె.శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు, కర్నూలు



హరేకృష్ణ..హరే హరే

ఆళ్లగడ్డ: పట్టణంలో రష్యా దేశస్తులు చేపట్టిన హరే కృష్ణ నగర సంకీర్తన ఆదివారం కమనీయంగా సాగింది. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం ఆవరణ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు అక్కడి నుంచి అమ్మవారిశాల వరకు సుమారు 4 గంటల పాటు ఈ సంకీర్తన కొనసాగింది. విదేశీ భక్తులకు స్థానికులు పూలమాలలు, మంగళ హారతులు పట్టారు. వారి కృష్ణ నామస్మరణను విని పులకించారు. అంతకు ముందు ఇస్కాన్ సభ్యులు, భక్తులు కృష్ణ, బలరాముల ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ నగీన ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బాబు కుట్రలో షర్మిల కీలుబొమ్మ

- వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దార సుధీర్



నందికొట్కూరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుట్రలో షర్మిల కీలుబొమ్మగా మారారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రధాన ప్రత్యర్థి అయిన చంద్రబాబుతో షర్మిల చేతులు కలపడం సమంజసం కాదు. పిల్లనిచ్చి, పదవులిచ్చిన మామ నందమూరి తారక రామారావుకే వెన్నుపోటు పొడిచిన చరిత్ర చంద్రబాబుది. అలాంటి వ్యక్తితో షర్మిల జతకట్టి సొంత అన్న వైఎస్ జగన్‌ను రాజకీయంగా దెబ్బతీయడానికి కుట్ర పన్నుతున్నారు. చెల్లిపై ప్రేమతో వైఎస్ జగన్ రూ. 200 కోట్లు ఇవ్వడమే కాకుండా ఆస్తిలో 40 శాతం వాట ఇచ్చారు. ఇలా దేశంలో ఏ అన్న ఇవ్వలేద'న్నారు. చంద్రబాబు తన సొంత తమ్ముడినే మోసం చేశారని, చెల్లెళ్లకు చిల్లిగవ్వ ఆస్తి ఇవ్వలేదన్నారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు సూక్తులు వల్లించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

'కుందూ' రక్షణ కట్ట తరిగిపోతోంది

- డబ్బు సంపాదనే ధ్యేయంగా తెలుగు తమ్ముళ్ల మట్టి తవ్వకాలు
- ఆందోళనలో నదీ తీర గ్రామాల ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు



కోవెలకుంట్ల సమీపంలో మట్టి తరలించడంతో బలహీన పడిన కుందూనది రక్షణ కట్ట

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగు తమ్ముళ్ల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. డబ్బు సంపాదనే ధ్యేయంగా దందా సాగిస్తున్నారు. కోవెలకుంట్ల పట్టణ శివారులో ప్రవహిస్తున్న కుందూనదికి ఏర్పాటు చేసిన రక్షణ కట్టను సైతం కొందరు కొల్లగొడుతున్నారు. దీంతో కట్ట బలహీన పడి సమీప గ్రామాల్లోని వరద నీరు వచ్చే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుందూనది విస్తర్ణ పనులు చేపట్టింది. ఇందులో భాగంగా నదిలో పూడిక (మట్టి)తీసి దానిని నది ఒడ్డున కరకట్టగా ఏర్పాటు చేసింది. వర్షాకాలంలో నదికి నీరు అధికంగా చేరినా నదీతీర గ్రామాలు, పొలాలను వరద ముంచెత్తకుండా ఈ పనులు చేసింది. నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లో కుందూనది విస్తరణ పనులు జరిగాయి. టీడీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ నేతలు ఈ మట్టికట్టను సైతం వదలకుండా తవ్వకాలు జరుపుతున్నారు. ప్రొక్లెయిన్లు ఏర్పాటు చేసుకుని కట్టను తవ్వి మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. పెద్దపెద్ద గోదాముల నిర్మాణం, లోతట్టు ప్రాంతాలను చదును చేసుకునేందుకు, ఇళ్ల నిర్మాణాల కోసం మట్టిని తరలిస్తున్నారు. కొందరు టీడీపీ నాయకులు ట్రాక్టర్ మట్టిని రూ. వెయ్యి నుంచి రూ. 1200 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. కోవెలకుంట్ల తహసీల్దార్ కార్యాలయానికి కేవలం వంద మీటర్ల దూరంలోనే ఈ దందా సాగుతున్నా రెవెన్యూ అధికారులు కానీ కేసీ కెనాల్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రతి రోజు వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తుండటంతో కట్ట బలహీన పడింది. వర్షాకాలంలో నదికి వరదనీరు చేరితే పంటపొలాలు, గ్రామాల్లోకి వరదనీరు చేరే ఆస్కారం ఉందని నదీతీర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నీరుగారిన లక్ష్యం

- హంద్రీనీవా ఎత్తి పోతల పథకంపై సర్కారు నిర్లక్ష్యం
- నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతో 1,688 క్యూసెక్కులకు తగ్గిన నీటి ప్రవాహం
- పూర్తి స్థాయిలో నిండని చెరువులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

అధికారంలోకి వస్తే హంద్రీనీవా కాలువకు సమృద్ధిగా నీరిస్తాం ...కృష్ణా జలాలతో జిల్లాలోని చెరువున్నీ నింపి కరువు నేలను సస్యశ్యామలం చేస్తామని తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో హోరెత్తించారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాలువ నిర్వహణ ఖర్చులకు పైసా కూడా విదల్చలేదు. దీంతో కృష్ణా, తుంగభద్ర నదులకు 1000 టీఎంసీల పైగా నీరు వచ్చినా అందులో ఇప్పటి వరకు 2 శాతం నీరు కూడా హంద్రీనీవా కాల్వకు పంపింగ్ కాకపోవడంతో ఆయకట్టు కింద పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



పూర్తి స్థాయిలో నిండని డోన్ మండలం బొందిమడుగుల చెరువు

కర్నూలు సిటీ: రాయలసీమ జిల్లాలకు సాగు, తాగు నీటిని అందించేందుకు హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఏర్పాటైంది. వర్షాకాలంలో కృష్ణానదికి వచ్చే వరద నీటిని ఆగస్టు నుంచి నవంబరు వరకు 40 టీఎంసీల మేర లిఫ్ట్ చేసి 6.025 లక్షల ఎకరాలకు సాగు, 30 లక్షల మంది జనాభాకు తాగు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లాలో నందికొట్కూరు, కర్నూలు, కల్లూరు, కోడుమూరు, వెల్దుర్తి, కృష్ణగిరి, దేవనకొండ, పత్తికొండ, గోనెగండ్ల, తుగ్గలి, ఆస్పరి మండలాల్లో 79,332 ఎకరాలకు సాగు, తాగు నీరు అందించాలి. హంద్రీనీవా ప్రధాన కాలువ మొత్తం 216.3 కి.మీ ప్రవహిస్తుంది. 2012 నవంబరు 18వ తేదీన జాతికి అంకితం చేసిన సమయంలో 2500 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్న ఈ కాలువను 2017లో అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం హంద్రీనీవా సర్కిల్-1లోని 134 కి.మీ వరకు రూ.629.31 కాల్వను 3,850 క్యూసెక్కుల సామర్థ్యానికి విస్తరించేందుకు పనులు చేపట్టి రూ.260 కోట్లు ఖర్చు చేసింది. అయితే, ఎక్కడా కూడా కాల్వ సామర్థ్యం పెరగలేదు. దీంతో ప్రస్తుతం ఆ కాల్వ 1,688 క్యూసెక్కుల ప్రవాహానికే పరిమితమైంది. పొరపాటున ఇంతకు మించి నీటిని పంపింగ్ చేస్తే కాల్వ గట్లపైకి నీరొస్తుంది.

నిర్వహణలేకపోవడంతో..

ఇప్పటికే హంద్రీనీవా కాలువ నీటిపై ఆధారపడి రైతన్నలు ఆగస్టు చివరి వారం నుంచి లేట్ ఖరీఫ్ కింద మిరప, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు సాగు చేశారు. ఇందుకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. అయితే, కాల్వ నిర్వహణను సర్కారు గాలికి వదిలేసింది. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా పైసా నిధులు ఇవ్వలేదు. ప్రధాన కాల్వకు రెండు చోట్ల గండ్లు పడ్డాయి. వాటిని ఇప్పటి వరకు పూడ్చలేదు. మరోవైపు లక్ష్యం ప్రకారం ఆగస్టు నుంచి నవంబర్ వరకు 40 టీఎంసీల వరద నీటిని కాలువకు ఎత్తిపోయాలి. ఇందులో ఇప్పటి వరకు కేవలం 11 టీఎంసీల లోపు నీరే పంపింగ్ చేశారు. ఈ అరకొర నీటితో ఆయకట్టు పంటలను ఎలా కాపాడుకోవాలి అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తుగ్గలి మండలం జి.ఎర్రగుడి చెరువులో నీరు లేక చెట్లు పెరిగిన దృశ్యం



కళతప్పిన చెరువులు

2019 ఎన్నిల ముందు టీడీపీ సర్కారు హడావుడిగా 68 చెరువులకు నీరు ఇచ్చేందుకు రూ.224.31 కోట్లతో అనుమతులు ఇచ్చి 13 శాతం మాత్రమే పనులు చేయించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూసేకరణ, డిజైన్స్‌కి అనుమతులతో పాటు, ఫారెస్ట్ భూములకు స్టేజ్-1, స్టేజ్-2 అనుమతులు ఇప్పించి వేగవంతంగా పనులు పూర్తి చేయించింది. అప్పటి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని టీడీపీ హయాంలోని 68 చెరువులకు మరో 12 చెరువులను చేర్చి మొత్తం 80 చెరువులకు నీరిచ్చేటట్లు పనులు చేయించారు. ఫలితంగా ఈ పథకం ద్వారా డోన్, పత్తికొండ, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాలోని 57 గ్రామాలకు, 10,130 ఎకరాలకు తాగు, సాగు నీరు అందుతుంది. అయితే, ఈ ఏడాది నిర్వహణ నిధులు లేక భారీ వర్షాలు కురిసినా హంద్రీనీవా కాల్వ నుంచి చెరువులు నింపలేని పరిస్థితి. ఇప్పటి వరకు 10.73 టీఎంసీల నీటిని మాత్రమే పంపింగ్ చేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 19 చెరువుల్లో మాత్రమే జలకళ ఉంది. వాస్తవంగా 70కిపైగా చెరువులకు నింపేందుకు అవకాశం ఉంది. అయితే, కూటమి సర్కారు నిధులు ఇవ్వకపోవడంతో తామేమీ చేయలేకపోతున్నామని ఇంజినీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.

పప్పుశనగ సాగుపై నీలినీడలు !

- భారీ వర్షాలతో బీడుగా మారిన పొలాలు
- జిల్లాలో రబీ కింద 1.55 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం
- ఇప్పటి వరకు సాగైంది వెయ్యి ఎకరాల్లోపే..
- విత్తుకు 20 రోజులే అనుకూలం
- సబ్సిడీ విత్తనాలపై ఆసక్తి చూపని రైతులు


కోవెలకుంట్ల మండలంలో తుపాను ప్రభావంతో శనగ దెబ్బతినడంతో పంటను దున్నేస్తున్న రైతన్న

కోవెలకుంట్ల: గతేడాది వర్షాభావంతో పప్పుశనగ సాగులో తీవ్ర నష్టాలు చవిచూసిన రైతులకు ఈసారి కూడా కలిసివచ్చేలా లేదు. సీజన్ ఆరంభంలోనే వారికి కష్టాలు ప్రారంభమయ్యాయి. అధిక వర్షాలు, విత్తన కొరత, తదితర వాతావరణ పరిస్థితులు వెంటాడు తుండటంతో శనగ సాగుపై నీలినీడలు అలుము కున్నాయి. జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది రబీ సీజన్ మొదటి పంటగా 1.55 లక్షల ఎక రాల్లో పూలేజి, జేజీ-11 రకాలకు చెందిన శనగ పంట సాగు కావాల్సి ఉంది. ఇందులో కోవెలకుంట్ల వ్యవ సాయ సబ్ డివిజన్‌లోని సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, కోవెలకుం ట్ల మండలాల్లో అత్యధికంగా 1.03 లక్షల ఎకరాల్లో శనగ సాగు లక్ష్యం. ఈ నెల 10వ తేదీ నుంచి విత్తన సాగుకు అదును కాగా ఆయా మండలాల్లో రైతులు రసాయన ఎరువులు వేసి విత్తనం వేసేందుకు పొలా లకు సిద్ధం చేసుకున్నారు. విత్తన సమయంలో తుఫాన్ ప్రభావంతో వారం రోజులపాటు భారీ వర్షాలు కుర వడం వల్ల విత్తన ప్రక్రియ నిలిచిపోయింది.

వచ్చే నెల 15 వరకే సాగుకు అదును

ప్రతి ఏటా అక్టోబర్ మొదటి వారం నుంచి నవంబర్ 15వ తేదీలోపు శనగ విత్తనానికి అదును. విత్తనానికి ముందు పదునయ్యే వర్షం కురిస్తే విత్తనం వేశాక చలి, మంచుకే పైరు పండుతుంది. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, తదితర పెట్టు బడుల రూపంలో ఎకరాకు రూ. 12 వేలు వెచ్చిస్తే దిగుబడులు చేతికందుతాయి. వాతావరణం అను కూలిస్తే ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. తక్కువ పెట్టుబడి, అధిక దిగుబ డులు వచ్చే అస్కారం ఉండటంలో జిల్లాలో ప్రతి ఏటా రబీ సీజన్‌లో రైతులు పప్పుశనగ పంటను సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే, ఈసారి వారం రోజులకు పైగా భారీ వర్షాలు కురియ డంతో విత్తనం వేసేందుకు ఆటంకం ఏర్పడింది.


గుంజలపాడు సమీపంలో భారీ వర్షాలతో బీడుగా మారిన పొలం

జిల్లాలోని ఆయా మండలాల్లో 1.55 లక్షల ఎకరాల్లో శనగ పంట సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు వెయ్యి ఎకరాల్లోపే సాగు కావడం గమనార్హం. భారీ వర్షాల కారణంగా పొలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి బీళ్లుగా మారటంతో రైతులు ఆం దోళన చెందుతున్నారు. పిచ్చిమొక్కలు, కలుపు తొల గించుకోవలన్నా పొలాల్లో తేమశాతం అధికంగా ఉం డటంతో పనులు ముందుకు సాగడం లేదు. నవం బర్ 15వ తేదీవరకు మాత్రమే విత్తనం వేసేందుకు అదును కావడంతో శనగ సాగు పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని రైతులు వాపోతున్నారు.

సబ్సిడీ విత్తనాల పేరుతో రైతన్నకు శఠగోపం

శనగ సాగును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రతి ఏటా సబ్సిడీతో విత్తనాల పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది జిల్లాలోని 29 మండలా లకు సంబంధించి 42,155 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా ఇప్పటి వరకు 23,208 క్విం టాళ్ల శనగ విత్తనాలను మంజూరు చేసింది. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాల పూర్తి ధర క్విం టాకు రూ. 9,400 ధర నిర్ణయించి 25 శాతం సబ్సిడీతో రూ. 7,050 ప్రకారం సరఫరా చేస్తోంది. ఆయా రైతు సేవా కేంద్రాల్లో రైతులు విత్తనాలు పొందేందుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించారు. ఎకరాకు 40కిలోల చొప్పున, గరిష్ఠంగా ఐదు ఎకరాకు రెండు క్విం టాళ్ల చొప్పున సరఫరా చేస్తున్నారు. మార్కె ట్‌లో క్వింటా శనగ విత్తనాల ధర రూ. 7 వేల లోపే ఉంది. సబ్సిడీ విత్తనాల పేరుతో ధరను గరిష్ఠంగా పెంచి మార్కెట్ ధర కన్నా ఎక్కువ ధరకు సరఫరా చేస్తుండటంతో రైతులు విత్త నాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబర చడం లేదు.

భారీ వర్షాలతో సాగుకు ఆటంకం



ఈ ఏడాది పప్పుశనగ సాగుకు భారీ వర్షాలు ఆటంకంగా మారాయి. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో శనగ విత్తనం వేసేం దుకు పొలాన్ని సిద్ధం చేసుకున్నాను. వారం రోజులపాటు భారీ వర్షాలు కురవడంతో విత్తనం వేసేందుకు అస్కారం లేకుండా పోయింది. పొలాలు బీళ్లుగా మారటంతో కలుపు నివారించుకునే పనులు చేపడుతున్నాం. వచ్చే నెల 15వ తేదీ వరకు మాత్రమే విత్తనానికి గడువు ఉంది.

– కామేశ్వరరెడ్డి, రైతు, కోవెలకుంట్ల

50 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలి



ఈ ఏడాది ఎనిమిది ఎక రాల విస్తీర్ణంలో శనగ పం ట సాగు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రెండు ఎక రాల్లో విత్తనం వేశాను. శనగ సాగుకు ప్రభుత్వం 25 శాతం సబ్సిడీతో మాత్రమే విత్తనాలు సర ఫరా చేస్తోంది. మార్కెట్ ధరతో పోల్చుకుంటే సబ్సిడీ శనగ విత్తనాల ధర అధికంగా ఉంది. అలా కాకుండా మార్కెట్ ధరకు అనుగుణంగా ధర నిర్ణయించి 50 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు సరఫరా చేయాలి.

– మోహన్‌రెడ్డి, రైతు, చిన్నకొప్పెర్ల, కోవెలకుంట్ల మండలం

క్లుప్తంగా

మహానందిలో జేసీ పూజలు


వేద పండితుల ఆశీర్వచనం అందుకుంటున్న జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య

మహానంది: కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ ఏఈఓ ఎరమల మధు, అధికారులు వారికి స్వాగతం పలికారు. తర్వాత కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనానంతరం వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదపండితులు ఆశీ ర్వదించారు. వారి వెంట తహసీల్దార్ రమా దేవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆకతాయికి దేహశుద్ధి

ఎమ్మిగనూరురూరల్: పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆంధ్ర బ్యాంక్ సమీపంలో ఆదివారం సంత కావటంతో సరుకులు తీసుకెళ్లేందుకు వచ్చిన భార్యభర్తలు కూర్చొని మాట్లాడుతు న్నారు. అంతలో పూటుగా మద్యం తాగి వచ్చిన ఓ వ్యక్తి మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అక్కడే ఉన్న భర్త అతన్ని పట్టుకొని చెప్పుతో దేహశుద్ధి చేస్తుండటంతో తప్పించుకొని పారిపో తుండగా పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

బాలిక ఆత్మహత్య

మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరు బీసీ కాలనీకి చెందిన బాలిక అనుష (16) ఆత్మహత్య చేసుకుంది. కేవీఆర్ జూనియర్‌కాలే జీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువు తున్న ఈబాలిక శనివారం ఇంటికి వచ్చింది. ఏమైందోఏమో తెలియదు కానీ అదే రోజు సాయంత్రం ఇంట్లో రసాయన ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబస భ్యులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆదివారం ఉదయం కోలుకోలేక మృతి చెందిం ది. ఈమేరకు తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఓబులేసు తెలిపారు.

అలా చేయడం ర్యాగింగ్ కాదు

కర్నూలు సిటీ: కర్నూలు మెడికల్ కాలేజీలో ఇటీవల జరిగిన సంఘటన ర్యాగింగ్ కిందకు రాదని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ తెలిపారు. ఘటనకు సంబంధించిన విచారణ వివరాలను ఆదివారం ఆమె మీడియాకు వెల్లడిం చారు. కాలేజీ ర్యాగింగ్ వ్యతిరేక కమిటీ సభ్యులు అయిన తాను, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సి పాల్ డా.హరి చరణ్, డా.విజయానంద బాబు, డా.రేణుకా దేవితో కలిసి 240 మంది విద్యార్థు లతో మాట్లాడడం జరిగిందన్నారు. వారి నుంచి లిఖిత పూర్వకంగా అభిప్రాయాలు తీసుకున్నామ న్నారు. యాప్ డౌన్‌లోడ్ అనేది పాఠ్యాంశం కిం దకు వస్తుందని, గడ్డాలు, మీసాలు తీయడం అనేది క్రమ శిక్షణలో భాగమేనని ఇదీ సీనియర్లు, జూనియర్స్‌ను ర్యాగింగ్ చేయడం కిందకి రాదని ఆమె వివరించారు.

యువతి అదృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని పొట్టిపాడు గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్‌ఐ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన మాధవి అనే యువతి గత రాత్రి బయటకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంట్లో నుంచి వచ్చింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. యువతి తల్లి వీరమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

శ్రీశైలం ప్రాజెక్ట్: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు, ఒకరికి స్వల్ప గాయాల య్యాయి. సున్నిపెంట శ్మశానవాటిక వద్ద ఆది వారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. శ్రీశైల సమీపంలోని హఠకేశ్వరం నుంచి గిరిజనులు నాగరాజు, నాగమ్మ, లింగమ్మ మోటార్‌బైక్‌పై సున్నిపెంటకు వస్తుండగా, నందికొట్కూరు మం డలం తంగెడంచ గ్రామానికి చెందిన ప్రతాప్ సున్ని పెంట నుంచి శ్రీశైలానికి స్కూటీపై వెళ్తున్నాడు. సమీపంలోని శ్మశాన వాటిక వద్ద ఆ రెండు బైక్‌లు ఎదురెదురై ఢీకొన్నాయి. ఈ ఘటనలో క్షతగాత్రు లను 108 వాహనంలో సున్నిపెంట ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు ప్రతాప్, నాగమ్మ, నాగరాజులకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు జిల్లా వైద్యశాలకు రెఫర్ చేశారు. లింగమ్మ స్థానిక ఆసుపత్రిలోనే చికిత్స పొందుతుంది. ఈ మేరకు టూటౌన్ పోలీ సులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


తీవ్రంగా గాయపడిన ప్రతాప్

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ముగింపు కార్య క్రమంలో కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు, డీటీఈఓ పరమేశ్వర రెడ్డి, ఎస్‌జీఎఫ్ అండ ర్-19 ఉమ్మడి జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ పాల్గొ న్నారు. విజేతలకు కప్పులు, మెడల్స్, మొమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లా డుతూ.. మేధస్సుకు పదును పెట్టే చెస్ క్రీడాంశంలో పాల్గొన్న అందరినీ అభినందిస్తున్నామన్నారు. చెస్ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకావడం హర్షణీయమన్నారు.

విజేతల వివరాలు

బాలుర విభాగంలో వెంకట దినేష్ (ప్రకాశం జిల్లా), నాగ అఖిల్ (తూర్పు గోదావరి), మహమ్మద్ జమీ రుల్ (అనంతపురం), యుగంధర్ (కర్నూలు) వెంకట విశ్వతేజ (చిత్తూరు), బాలికల విభాగంలో అభిజ్ఞ (అనంతపురం), అమృత వర్షిణి (తూర్పు గోదావరి), లాస్య (తూర్పు గోదావరి), శివ శరణ్య (కృష్ణా జిల్లా), భువన కృతి (అనంతపురం) విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు నిర్వా హకులు వెల్లడించారు.


ట్రోఫీ అందుకుంటున్న ప్రకాశం జిల్లా జట్టు

వీడని ఆర్‌ఎంపీ హత్యకేసు మిస్టరీ

కొలిమిగుండ్ల: బెలుంకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు కొండయ్య హత్యపై మిస్టరీ వీడలేదు. శనివారం హత్య చేసి బెలుం శింగవరం సమీపంలోని గాలేరు నగరి వరద కాల్వలో మృతదేహాన్ని పడేసిన విషయం తెలి సిందే. కాల్వ సమీపంలోని రాళ్ల గుట్టపై నివాసం ఉం టున్న వృద్ధ దంపతులు ఆనంద్‌రెడ్డి, మహేశ్వరమ్మకు వైద్యం అందించేందుకు వెళ్లి కొండయ్య హత్యకు గుర య్యాడు. ఈ ఘటనలో ఆనంద్‌రెడ్డి దంపతుల కుమా రుడు విశ్వనాథరెడ్డి ప్రమేయం ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. డాక్టర్ మెడలో ఉన్న బంగారు గొలుసు, రెండు ఉంగరాలను అప్పగించారు.విశ్వనాథ రెడ్డి బెలుం శింగవరంలోనే లారీ డ్రైవర్‌గా పని చేస్తుం టాడు. బంగారు వస్తువుల కోసమే ఈ హత్యకు పాల్ప డ్డారా..లేక ఇతర కారణాలున్నాయా అన్నది తెలియా ల్సి ఉంది. ఈ క్రమంలో బెలుంకు చెందిన ఒకరిద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిం చడంతో హత్య వెనుక ఇతరుల ప్రమేయం ఉందా అనే అనుమానాలు స్థానికుల్లో కలుగుతున్నాయి. కొం డయ్య 15 ఏళ్ల క్రితం సుంకేసుల నుంచి బెలుంలో స్థిర పడి ఆర్‌ఎంపీగా వైద్యం అందిస్తూ గ్రామస్తుల ఆదరా భిమానాలు పొందాడు. అలాంటి వ్యక్తి హత్యకు గురికావడాన్ని ప్రజలు నమ్మలేక పోయారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని సూదేపల్లి గ్రామానికి చెందిన సునీల్ (21) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరా లు.. గ్రామానికి చెందిన రాజు, పద్మావతి దంపతు లకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు సునీల్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తు న్నాడు. ఆదివారం కూలీలను ఆటోలో ఎక్కిం చుకుని పొలానికి వెళ్లాడు. సాయంత్రం పొలం పనుల ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు కూలీలు ఆటో వద్దకు వచ్చారు. ఆటోలో పడుకున్న సునీల్‌ను తట్టి లేపేందుకు ప్రయత్నించగా కదలిక లేవకపోవడంతో అనుమానంతో వెల్దుర్తి సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. అక్కడ డ్యూటీ డాక్టర్లు లేకపోవడం తో ట్రైనీ డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు తెలి పారని కుటుంబసభ్యులు చెప్పారు. సకాలంలో వైద్యులు ఉండి చికిత్స అందించి ఉంటే యువకుడు బతికేవాడని మృతుడి బంధువులు వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు మృతదేహానికి పోస్టుమార్టం చేయాలని కోరారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడి అకాల మరణంతో కుటుంబసభ్యులు కన్నీరుమ న్నీరుగా విలపిస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రఫీక్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని గోనెగండ్ల రోడ్డులో వెల్డింగ్ పని చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రఫీక్ (28) అనే వ్యక్తి మృతి చెం దాడు. వివరాలు.. మైనా ర్టీ కాలనీకి చెందిన శం షుద్దీన్ కుమారుడు రఫీక్ (28) వెల్డింగ్ పని చేస్తుం డేవాడు. ఆదివారం మధ్యాహ్నం వెల్డింగ్ పనిచేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో స్పృహ తప్పి కింద పడిపో యాడు. అక్కడ పనిచేస్తున్న వారు వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతు డికి నాలుగు నెలల క్రితమే వివాహం జరిగినట్లు బంధువులు తెలిపారు. మృతదేహానికి అంత్యక్రి యలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఇం టికి తీసుకెళ్లారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు: గుట్టుగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కృష్ణ, ఎస్‌ఐ మారుతి, ప్రసాదు, సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించి 34 కర్ణాటక మద్యం బాక్స్‌లు, బొలెరో స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఆదివారం సీఐ కృష్ణ తెలిపిన వివరాల మేరకు..హొళగుంద మండలం నుంచి హెబ్బటం గ్రామం మీదుగా ఆదోని వైపు వెళ్తున్న కేఏ34సి 9504 బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా.. 34 కర్ణాటక మద్యం బాక్స్‌లు, ఒరిజినల్ చాయిస్ 90 ఎంఎల్ డిప్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కర్ణాటక మద్యాన్ని వివిధ గ్రామాలకు చేరవేసేందుకు హొళగుం ద గ్రామానికి చెందిన ముల్లా తవ్షీష్, ముత్తప్ప ఆదోని పట్టణానికి చెందిన రాఘవేంద్రను అరెస్ట్ చేసి, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. మద్యం విలువ రూ.1.30 లక్ష ఉంటుందని వివరించారు. కానిస్టేబుళ్లు గిరిబాబు, శంకర్, నాయక్, పరిరక్షిత పాల్గొన్నారు.


కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్న కర్నూలు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

తల్లిదండ్రుల చెంతకు బాలిక

కర్నూలు (టౌన్): హాస్టల్ ఉంటున్న ఓ బాలికకు అమ్మ గుర్తుకొచ్చి ఏ ఒక్కరికీ చెప్పకుండా ఇంటికి బయలుదేరింది. అప్పటికే హాస్టల్‌కు వచ్చిన వార్డెన్ బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులకు, పోలీ సులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీ సులు 24 గంటల్లో ఆ బాలికను తల్లిదండ్రుల చెం తకు చేర్చారు. వివరాలు.. బి.తాండ్రపాడుకు చెం దిన వడ్ల రామచారి కూతురు కర్నూలు నగరంలో కలెక్టరేట్ సమీపంలోని హాస్టల్‌లో ఉంటోంది. అక్కడి ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువు తోంది. శనివారం సాయంత్రం ఇంటికి పోవాలని బయలుదేరింది. అయితే ఎలా వెళ్లాలో తెలియక వినాయక ఘాట్ వద్ద కూర్చొంది. నగర శివారులోని ప్రజానగర్‌లో నివసించే ఫాతిమా అనే మహిళ అటువైపు వెళుతూ బాలికను చూసి ఆటోలో ఇంటికి తీసుకెళ్లింది. మరోవైపు హాస్టల్ వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అప్రమత్తమ య్యారు. డీఎస్పీ బాబుప్రసాద్ మూడవ పట్టణ పోలీసులు, తాలుకా పోలీసులను రెండు బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చేపట్టాలని ఆదేశించారు. ముమ్మరంగా తనిఖీలు నిర్వహించిన పోలీసులు ఆటో డ్రైవర్లను విచారించారు. ఓ ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు ప్రజానగర్‌కు వెళ్లి బాలికను స్టేషన్‌కు తరలించారు. సమాచారం మేరకు స్టేషన్‌కు వచ్చిన తల్లిదండ్రులకు బాలికను అప్పగించారు. తప్పిపోయిన బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన మూడవ పట్టణ సీఐ మురళీధర్ రెడ్డి, ఎస్‌ఐ పీరయ్య, హుస్సేన్, మోహ న్‌కిషోర్ రెడ్డి, పోలీసులను డీఎస్పీ అభినందిం చారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

డోన్ రూరల్: మండల పరిధిలోని బొంతిరాళ్ల గ్రామం వద్ద ఆదివారం ఆటో, బైక్ ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. డోన్ పట్టణం నుంచి హరి, వేణుగోపాల్ బైక్‌పై వెళ్తుండగా బొంతిరాళ్ల గ్రామం నుంచి డోన్ వైపు వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో హరి, వేణు గోపాల్‌తో పాటు ఆటోలోని రంగనాయకులు, మహేష్ గాయపడ్డారు. వారిని డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.


గాయపడిన వేణుగోపాల్

కోడుమూరులో మహా కేటుగాళ్లు

- దుకాణదారులు, వ్యాపారులే లక్ష్యం
- అప్రమత్తంగా ఉండాలంటున్న సీఐ


బంగారు ఉంగరం కాజేసి బైక్‌పై పారిపోతున్న దుండగులు



సిమెంట్ వ్యాపారిని మోసగించి నగదుతో జారుకుంటున్న దుండగుడు

కోడుమూరు రూరల్: కోడుమూరులో కొందరు కేటుగాళ్లు సరికొత్త మోసాలకు తెరలేపారు. ఎక్కడినుంచి వచ్చారో తెలి యదుగానీ అమాయకులైన వ్యాపా రులను టార్గెట్ చేసుకుని బురిడీ కొట్టిస్తు న్నారు. వ్యాపారం పేరుతో షాపులకు వస్తూ మోసాలకు పాల్పడుతుండడంతో వ్యాపారస్తులు ఎవరిని నమ్మాలో.. ఎవ్వ రిని నమ్మకూడదో తెలియక బెంబేలెత్తి పోతున్నారు. ఈ కోవలో జరిగిన కొన్ని మోసాలకు సంబంధించిన వివరాలు.

- కోడుమూరు మెయిన్ బజార్‌లోని కేదార్‌నాథ్ టెక్స్‌టైల్‌లో వ్యాపారి శ్రీనివా సులు వద్దకు ఈ నెల 25న బట్టలు కొనే నెపంతో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. దుకా ణదారుడితో మాటలు కలిపి వ్యాపారం బాగా జరగాలంటే పాత పది రూపా యల నోటుకు కుంకుమతో పూజలు చేసి బీరువాలో ఉంచాలని నమ్మబలికారు. వ్యాపారి నోటును ఇవ్వగా పూజలు చేసి నోటుపై బంగారు వస్తువు పెట్టాలని చెప్పారు. దుకాణదారుడు చేతికున్న ఉం గరాన్ని తీసి ఇవ్వగా కాసేపు పూజలు చేస్తున్నట్లు నటించి బీరువాలో పెట్టారు. పది నిమిషాల తర్వాత బీరువా తెరచి ఉంగరాన్ని నీటితో శుద్ధి చేసి ధరించాలని చెప్పి అక్కడి నుంచి ఉడాయించారు. కాసేపటికి బీరువా తెరచిన వ్యాపారికి ఉంగరం కనిపించకపోవడంతో మోసపో యానని తెలుసుకొని పోలీసులను ఆశ్రయించగా వారు కేసు నమోదు చేసుకుని సీసీ పుటేజీ ఆధారంగా విచా రణ చేపట్టారు.
- ఈ నెల 26న మరో కేటుగాడు వెంకట గిరి రోడ్డులోని చెన్నరెడ్డి అనే సిమెంట్ వ్యాపారి వద్దకు వెళ్లి తనకు సిమెంట్ కావాలని చెబుతూ మాటలు కలిపాడు. ఈ నేపథ్యంలో తాను వేరే వ్యక్తికి రూ.వెయ్యి ఇవ్వాలని నగదు ఇస్తే సిమెంట్ డబ్బులు, వెయ్యి కలిపి ఫోన్ పే చేస్తానని చెప్పగా వ్యాపారి వెయ్యి ఇచ్చాడు. దుకాణానికి వేరే వాళ్లు రావడంతో వ్యాపారి మాట్లాడుతుం డగా కేటుగాడు అక్కడి నుంచి జారుకు న్నాడు. ఇదే కేటుగాడు ఎమ్మిగనూరు రోడ్డులోని పేపర్ విస్తరాకుల వ్యాపారి పక్కీ రప్ప వద్దకు వెళ్లి తనకు 3వేల విస్తరాకులు, గ్లాసులు కావాలంటూ మాటలు కలిపాడు. తాను వేరే వ్యక్తికి రూ.4 వేల నగదు ఇవ్వాలని తనకు డబ్బు ఇస్తే అంతా కలిపి ఫోన్‌పే చేస్తానని చెప్పాడు. నమ్మిన వ్యాపారి నగదు ఇవ్వగా వ్యక్తికి ఇచ్చి వస్తానని చెప్పి అక్కడి నుంచి ఉడాయిం చాడు. ఎంతసేపటికి ఆ కేటుగాడు రాకపో వడంతో మోసపోయినట్లు తెలుసుకున్న వ్యాపారి లబోదిబోమంటున్నాడు.

వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి

కొందరు కేటుగాళ్లు వ్యాపారుల ఆశను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడు తున్నారు. ఇలాంటి వారి పట్ల అప్రమ త్తంగా ఉండాలి. గుర్తు తెలియని వ్యక్తు లను ఎట్టి పరిస్థితుల్లో నమ్మరాదు. ఎవరి మీదైనా అనుమానం వస్తే వెంటనే పోలీ సులను సంప్రదించాలి. గ్రామాల్లో ఎవ రైనా అనుమానాస్పద వ్యక్తులు తిరుగు తుంటే పోలీసులకు సమాచారమివ్వాలి.

– శ్రీనివాసులు, ఎస్‌ఐ, కోడుమూరు

ముందుగా డబ్బు చెల్లించాల్సిందే!

- సిలిండర్ డెలివరీ అయిన తర్వాత రెండ్రోజుల్లో ఖాతాలోకి నగదు రీఫండ్
- చెల్లుబాటులో ఉన్న గ్యాస్ కనెక్షన్, రేషన్‌కార్డు, ఆధార్ కలిగిన వినియోగదారులు అర్హులు
- జిల్లాలో రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు 6,76,209
- అక్టోబర్ 29 నుంచి గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకునేందుకు అవకాశం



కర్నూలు(సెంట్రల్): టీడీపీ కూటమి అధికారం చేపట్టి ఐదు నెలలు కావొస్తున్నా ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడం తో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమం లో మహిళలకు ఇస్తామన్న ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నాలుగు నెలలకు ఒకసారి ఉచితంగా గ్యాస్ సిలిండర్‌ను అందించేలా ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా అక్టోబర్ 29వ తేదీ నుంచి బుక్ చేసుకున్న వినియోగదారులకు నాలుగు నెలలకు ఒకటి చొప్పున (ఏడాదికి మూడు) వంటగ్యాస్ సిలిం డర్లను ఉచితంగా ఇస్తారు.

అర్హతలు ఇవే..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత వంటగ్యాస్ సిలిండర్లను పొందాలంటే కచ్చితంగా చెల్లుబా టులో ఉండే గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డుతోపాటు ఆధార్ కార్డు ఉండాలి. రేషన్ కార్డు లేకపోతే ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి అనర్హులు. ఒకవేళ రేషన్ కార్డు ఉన్నా ఆ కార్డు యాక్టివ్‌లో ఉండాలి. అలాగే యాక్టివ్‌లో ఉన్న గ్యాస్ కనెక్షన్ ఉండాలి. అలాగే కుటుంబ యాజమాని ఆధార్ కార్డు కూడా యాక్టి వ్‌లో ఉంటే ఉచిత వంట గ్యాస్ సిలిండర్ పథకానికి అర్హులు అవుతారు. లేదంటే లేదు. జిల్లాలో రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు – 6,76,209 ఉండగా వంటగ్యాస్ కనెక్షన్ కలిగిన కుటుంబాలు 6,74,000 ఉన్నాయి.

ముందు వినియోగదారులే రుసుం చెల్లించాలి

రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలలకు ఒకసారి ఉచితంగా వంటగ్యాస్ సిలిండర్‌ను ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగా ప్రస్తుత నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మాసాలకు ఒకటి, అలాగే తరువాతి నాలుగు నెలలకు ఒకటి చొప్పున గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తారు. ఈ క్రమంలో అక్టోబర్ 31వ తేదీ నుంచి మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ అందనుంది. అయితే ముందుగా వినియోగదారుడే గ్యాస్ సిలిండర్ కోసం డబ్బులు చెల్లించాలి. సిలిండర్ డెలివరీ అయిన 24 గంటల తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఆ డబ్బును గ్యాస్ కనెక్షన్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు జమ చేస్తుంది.

రేషన్ కార్డు ఉన్న వారందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు



రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్‌సిలిం డర్ పథకాన్ని అక్టోబర్ 31వ తేదీ నుంచి అమలు చేయాలని నిర్ణయిం చింది. ఆ రోజు నుంచి బుక్ చేసు కున్న వారికి మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ వస్తుంది. చెల్లుబాటులో ఉన్న గ్యాస్ కనెక్షన్, రేషన్, ఆధార్ కార్డు ఉన్న వారే అర్హులు.

– రాజారఘువీర్, డీఎస్‌ఓ, కర్నూలు